ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర



## (పత్తేపురంలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 6-11-97)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మీకు ధ్యానం బాగా సాగాలంటే అతిగామాట్లాడకూడదు, ఆహారం విషయంలో, నిద్ర విషయంలో అతి పనికిరాదు. అతి వ్యవహారం పనికిరాదు. అతిగా ఉంటే ప్రాణశక్తి తగ్గిపోతుంది. మన మనస్సు, మాట, చేత స్వాధీనంలో ఉంటే మన చైతన్యస్థాయి పెరుగుతుంది. ఈ జన్మలోనే మనకు మోక్షంకలుగుతుంది. ఆలోచనే ప్రధానంగా ఉండాలి. ఏదైనా చదివేటప్పుడుగాని, వినేటప్పుడుగాని అది ఎంతవరకు మనకు ఉపయోగపడుతోంది అని వివేకంతో ఆలోచించాలి. పూర్వజన్మలో ఏదేవుడిని ఎక్కువగా ఉపాసన చేసారో, ఏమార్గంలో ప్రయాణం చేసారో అటువైపుకు మీమనస్సు మళ్ళింపబడుతుంది. పూర్వజన్మ నుండి వచ్చిన ఆ సంస్కారబలంవలన ఆమార్గం ఈ జన్మలో మీకు తేలికగా ఉంటుంది. మీకు తేలికగా ఉన్న మార్గాన్ని పట్టుకొని మీరు తరించాలి. అనుకరణపనికిరాదు. మీకు తేలికగా, సులభంగా, సుఖంగా ఉన్న మార్గంలో ఎంత ప్రయాణం చేసినా మీకు అలసటరాదు, సాధన మీద వెగటరాదు. ఒక అవతారపురుషునిగాని, ఇష్టమైన గురువును గాని మీరు ధ్యానం చేయవచ్చు. వారి మీద ప్రీతి, ప్రేమ ఉండాలి. ఇష్టం ఉంటే అంతా వచ్చేస్తుంది, ఇష్టం లేకపోతే ఏదీరాదు. ధ్యానం కూడా ఒక తలంపే, అదికూడా ఒక భావనే. ఏకచింతన మీరు చేస్తుఉంటే అది కూడా ఒక తలంపే అయినప్పటికి మిగతా తలంపులను తరిమివేసి చివరకు అదికూడా తప్పుకొని మీకు ఆత్మదర్శనాన్ని కలుగజేస్తుంది. ఈ తలంపులు అన్నీ ఎప్పుడు పోతాయి అని ఆలోచించటం కంటే మీకు ఏదైతే ఇష్టమో దానిని ప్రీతిగా, సరళంగా ధ్యానం చేస్తూ ఉంటే మిగతా తలంపులు వాటి అంతట అవే రాలిపోతాయి. మీరు ఏదైతే కాదో దానిని విడిచి పెట్టండి. మీరు ఏదైతే అవునోదాని గురించి ధ్యానించండి, స్మరించండి, శ్రవణం చేయండి, మననం చేయండి అప్పుడు మీకు ధ్యానబలం పెరుగుతుంది. ధ్యానబలం పెరుగుతూ ఉంటే మీకు అవసరం లేని విషయాలు దూరం అవుతాయి, రాలిపోతాయి, మాసిపోతాయి, మాడిపోతాయి,

నీవు వేరు, నేను వేరు అనే బేదబుద్ధి ఉన్నంత కాలం భయము, మోహం, బంధం అన్నీ వస్తాయి. వేరుభావన ఉన్నంతకాలం చెడుతలంపులు వస్తాయి. అజ్ఞాని ద్వేషించకుండా ఉండలేడు, జ్ఞాని ప్రేమించకుండా ఉండలేడు. వర్షం ఏవిధంగా భూమిని తడుపుతుందో అలాగ శాంతితరంగాల తోటి, ప్రేమతరంగాల తోటి, జ్ఞానతరంగాలతోటి ఈ సృష్టినంతా తడుపుతాడు వాడు జ్ఞాని. విసుగు లేకుండా, విరామం లేకుండా, వినయంగా శ్రవణం చేయాలి. అలా వినగా వినగా మీకు శ్రద్ధ కలుగుతుంది. శ్రద్ధ కలిగిన తరువాత అభ్యాసం చేయాలి, ధ్యానం చేయాలి, వారు అభ్యాసం చేసి బాగుపడ్డారు అలాగే మనం కూడా బాగుపడాలి అని లోపల నుండి ఆపుకోలేని కాంక్ష వస్తుంది.

మీరు అభ్యాసం చేసిన మీకు వైరాగ్యబుద్ధి లేకపోతే మీరు చేసిన అభ్యాసానికి రేణింపు ఉండదు. ఆధ్యాత్మికఅభివృద్ధి పొందటానికి అభ్యాసం, వైరాగ్యం అవసరం. ఈ రెండూ ఉంటే మనస్సు అణుగుతుంది. నీహృదయంలో చెడు తలంపులకు, మంచి తలంపులకు మధ్య యుద్ధం జరుగుతుంది. పాండవులు ఎంత గొప్పవారు అయినా కౌరవులను జయించాలంటే పరమేశ్వరుని సహాయం అవసరమయింది. అలాగే నీలోని చెడుతలంపులను జయించాలంటే నీ శక్తి సరిపోదు. పరమేశ్వరుని అనుగ్రహంతో వాటిని జయించగలవు. నీవు ఏతలంపును అయితే నిలబెట్టుకోవాలి అనుకొంటున్నావో ఆ తలంపు నిలబడాలంటే నీకు దేవుని కృప అవసరం. మీ ప్రయత్నం మీరు జాగ్రత్తగా చేసుకోవాలి. నిత్యము అభ్యాసము చేయాలి., పట్టుదల ఉండాలి, సహనం ఉండాలి, చేసేది విసుగు లేకుండా చేయాలి. మనం నెమ్మదిగా వెళ్లినా మార్గం సక్రమంగా ఉండాలి.

మనం అందరము భగవంతుని తెలునుకోవాలి అనుకొంటున్నాము. ఎందుకు అలాఅనుకొంటున్నాము, అంటే మనం అందరము ఆయన దగ్గర నుండే వచ్చాము అందువలన ఆయనలో కలిసిపోవాలి అనుకొంటున్నాము. ఆయన దగ్గర నుండి వచ్చాము కాబట్టి ఆయన దగ్గరకు వెళ్లేవరకు మనకు సుఖం లేదు, శాంతిలేదు. మీ మనస్సు యొక్క మూలాన్ని చూడటం నేర్చుకోండి అప్పడు పూజలు, జపాలు, ధ్యానాలతో సంబంధం లేకుండా మనస్సు యొక్క విజృంభణ ఆగిపోతుంది, మీ మనస్సు అణిగిపోతుంది. మనో మూలం చూడటం చేతకాకపోతే మనస్సు విజృంభిస్తూనే ఉంటుంది. నీవు జపం చేయగా చేయగా, ధ్యానం చేయగా, చేయగా ఉపాసన చేయగా చేయగా ఆ ఉపాసన చేసేవాడు పోతాడు, నీవు దేనికోసం ఉపాసన చేస్తున్నావో అదే నువ్వు అయిపోతావు. ఉపాసన చేసేవాడు జీవుడు.జీవుడు ఏ ఆత్మగురించి ఉపాసనచేస్తున్నాడో అందులో వీడు కరిగిపోతాడు. నీవు ఎవరో నీవు తెలుసుకోకుండా ఈ శరీరం శవం అయితే ఈ భూమి మీదకు వచ్చిన పని వృథా అన్నారు ఆచార్యులవారు. కాలాన్ని పాడు చేసుకోకుండా మహాత్ములను ఆశ్రయించి, వారిని గౌరవంగా చూసి వారిలో ఉన్న జ్ఞానాన్ని వెలికితీసి దానిని అనుభవించు అని చెప్పారు.

అంతా అనుగ్రహమే. సాధన చేయాలి, బాగుపడాలి అనే బుద్ధి నీకు కలుగుతూ ఉంటే అది కూడా అనుగ్రహమే. సాధన కూడా అనుగ్రహమే. బాగుపడటం కూడా అనుగ్రహమే. అంతా అనుగ్రహమే. ఉన్నదే అనుగ్రహం, నేను ఉదయం మొదలు సాయంత్రం వరకు బోధ చేసినా ఈశ్వరుని అనుగ్రహం లేకపోతే మీకు మారుమనస్సురాదు, తెలుసుకోవాలనేకాంక్ష ఉదయించదు. అనుగ్రహం వస్తే ఒక్క క్షణంలో మీ దుఃఖం అంతా ఆనందంగా మారిపోతుంది. ఆత్మానుభవం కలిగేవరకూ దృశ్యం నిన్ను విడిచిపెట్టదు. జన్మలు, తలంపులు, శరీరాలు, హెచ్చుతగ్గులు ఏవీ నిన్ను విడిచిపెట్టను. నీకు జ్ఞానోదయం అయ్యేవరకు ఏదో ఒక దృశ్యం నిన్ను పీడిస్తూనే ఉంటుంది. నేను అనే తలంపు నీకు ఉంది. అది వచ్చాక ఇతరతలంపులు వస్తున్నాయిగాని అది రాకముందు ఇతరతలంపులు లేవు. ఆమొదటి తలంపు మూ ాన్ని పట్టుకొంటే మనస్సు నశిస్తుంది. మీకు మంచి మంచి ఊహాలు, భావాలు, ఆదర్శాలు, అభిరుచులు వచ్చేస్తున్నాయి అనుకోండి. మేము మంచి వారము అని అనుకోవద్దు. ఆ మొదటి తలంపు అణిగే వరకూ ఎప్పటి కయినా ప్రమాదమే. ఆ మొదటి తలంపు మంచివారిని చెడ్డవారిగా మార్చేస్తుంది. మీకు వచ్చే గొడవలు అన్నీ దేనికి వస్తున్నాయి అంటే మనస్సుకే వస్తున్నాయి అందుచేత మనస్సుతో వాటిని బయటకు గెంటి వేయండి.